

వైసీపీలో సీఐడీ కలకలం

- శ్రీనివాసరెడ్డి హత్య కేసు ఎవరి మెడకు చుట్టుకుంటుందోనన్న గుబులు
- విచారణ మొదలెట్టిన సీఐడీ అధికారులు
- ఇప్పటికే కడపకు వచ్చిన బృందం
- నాడు శ్రీనివాసరెడ్డి కాల్ రికార్డే కీలకం

(కడప-ఆంధ్రజ్యోతి): భూకబ్జాలు, సెటిల్‌మెంట్లతో సొంతంగా ఎదుగుతుండడం.. లావాదేవీల్లో విభేదాలతో వైసీపీకి చెందిన శ్రీనివాసరెడ్డిని అతని సన్నిహితులే కత్తులతో పొడిచి పొడిచి చంపిన విషయం తెలిసిందే. అప్పుడు వైసీపీ గవర్నమెంటు ఉండడంతో ఈ కేసును చాలా సింపుల్‌గా మూసివేసి కీలక నేతలను తప్పించారంటారు. ఇప్పుడు టీడీపీ గవర్నమెంటు రావడం ఈ కేసు సీఐడీ చేతులకు వెళ్లడంతో ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి మంగళవారం ప్రముఖంగా ప్రచురించింది. సీఐడీ వ్యవహారం ఇప్పుడు వైసీపీలో కలవరం పుట్టిస్తోంది. ఈ కేసు ఎవరి మెడకు చుట్టుకుంటుందోనన్న భయంతె వైసీపీ నేత లు వణికిపోతున్నట్లు చెబుతున్నారు. పక్కాగా విచారణ జరిగితే శ్రీనివాసరెడ్డి హత్యకు పిన్‌పాయింట్ ఎవరో తెలిసే అవకాశం ఉందంటున్నారు. ఇదే జరిగితే.. భూకబ్జాలు, లావాదేవీలతో ఎన్నికోట్లు కొల్లగొట్టారు.. ఇందులో ఎవరి వాటా ఎంత, అసలు బాస్‌లు ఎవరో తెలిసిపోతుంది. నిందితులకు కఠినంగా శిక్ష పడితే భూకబ్జాలకు కళ్లెం పడుతుందని అంటున్నారు. ఈ కేసును సీఐడీ టేకప్ చేసిన తరువాత తిరుపతికి చెందిన బృందం ఇప్పటికే కడపకు వచ్చిపోయినట్లు చెబుతున్నారు.

భూములు మింగేశారు

వైసీపీ పాలనలో ఊరికో బకాసురుడు ఉన్నట్లుగా కడపలో కూడా వైసీపీకి చెందిన ఆ నలుగురు ఏరియాలు ఏరియాలుగా డివైడ్ చేసుకుని భూకబ్జాలకు పాల్పడ్డారంటారు. ఎంతగా అంటే ప్రైవేటు స్థలాల్లో నివాసం ఉన్న వారిని కూడా బెదిరించేసి ఖాళీ చేయించి స్వాధీనం చేసుకునే స్థాయికి దిగాయి. ఇక ఆ నలుగురి అనుచరులు కడపలో 147 గ్యాంగ్‌లను ఏర్పాటు చేసుకున్నారంటే జగన్ పాలనలో భూకబ్జాలతో ఎంత పేట్రేగిపోయారో అర్థమవుతుంది. ఇందులో ఓ ముఖ్యమైన గ్యాంగ్ శ్రీనివాసరెడ్డిది అంటారు. శ్రీనివాసరెడ్డి గ్యాంగ్ నాడు కడప నగరాన్ని నలుచెరుగులా చెరబట్టిన ఆ నలుగురికి భూసెటిల్‌మెంట్లు భారీగా చేశారంటారు. విలువైన స్థలం కనిపిస్తే శ్రీనివాసరెడ్డి గ్యాంగ్‌కు ఉప్పందిస్తే చాలు.. వెంటనే స్వాధీనం చేసుకుంటారని అంటున్నారు. అనతికాలంలోనే శ్రీనివాసరెడ్డి గ్యాంగ్ బాగా ఎదిగిపోయిందంటారు. ఆ నలుగురు నేతలకు సెటిల్ మెంట్లు చేయడంతో శ్రీనివాసరెడ్డికి ఏర్పడిన పరిచయాలు తాడేపల్లి వరకు వెళ్లడంతో లబ్ధి పొందిన వారే జీర్ణించుకోలేకపోయారంటారు. ఇలా సొంత సైన్యంతో చేసిన లావాదేవీల్లో తేడాలు రావడం, అతను ఆర్థికంగా ఎదగడంతో శ్రీనివాసరెడ్డిని గత ఏడాది జూన్ 23న నరికి చంపారు. అప్పట్లో ఈ ఘటన కలకలం రేపింది. బురఖాలు వేసుకుని కత్తులతో పొడవడం చూసి జనం భయాందోళనకు గురయ్యారు.

కేసు అలా నీరుగార్చారు

శ్రీనివాసరెడ్డి హత్యతో అప్పట్లో తెర వెనుక లబ్ధి పొందిన ముఖ్యులు ఉన్నారనే ప్రచారం సాగింది. కేసు విచారణలో భాగంగా అప్పుడు పోలీసులు ఆర్థిక లావాదేవీలకు సంబంధించి డాక్యుమెంట్లతో పాటు సెటిల్‌మెంట్ల ద్వారా శ్రీనివాసరెడ్డి నమోదు చేసుకున్న డైరీని, మరికొంత సమాచారాన్ని గుర్తించారంటారు. ఇక హత్య కేసుకు సంబంధించి కాల్ రికార్డులతో కీలకమైన సమాచారం బయటికి వచ్చిందని చెబుతారు. తీగ లాగితే డొంక కదిలినట్లు ఫోన్‌కాల్స్ డేటాతో ఈ వ్యవహారం ప్రముఖుల గుట్టు రట్టు చేసిందని సమాచారం. అయితే అప్పట్లో ఈ కేసు విచారించిన ఓ పోలీసు అధికారికి సెటిల్‌మెంటు బాస్‌గా పేరుంది. ఆయన వైసీపీకి ఊడిగం చేశారని అంటారు. ఆ అధికారి కాల్‌డేటాను పక్కనబెట్టేసి ఈ కేసునే డైవర్ట్ చేసి కేసులో ప్రముఖుల ప్రమేయం లేకుండా మమ అనిపించేసి సంబంధంలేని వారి పేర్లను కూడా తెరపైకి తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. పేర్ల తొలగింపులో పెద్ద డీల్ జరిగిందంటారు. అయితే కేసు సీఐడీ చేతికి వెళ్లడంతో ఇప్పుడు పాత్రధారుల్లో భయం మొదలైందని చర్చ నడుస్తోంది.



బురఖాల్లో వచ్చిన దుండగులు శ్రీనివాసరెడ్డిని కత్తులతో పొడుస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

సీన్ రీకన్‌స్ట్రక్షన్

శ్రీనివాసరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా సీఐడీ డీఎస్పీ మధులత ఆధ్వర్యంలో గత శనివారం ఓ బృందం కడపకు వచ్చింది. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఈ హత్యకు సంబంధించిన ఫైలు వివరాలు తీసుకున్నారు. హత్య ఎక్కడ జరిగింది, ఎలా జరిగిందని హత్య జరిగిన సంధ్య సర్కిల్‌లోని రాబిట్ ఫిట్‌నెస్ సెంటరు వరకు సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసినట్లు సమాచారం. ఇప్పటికే కొందరిని విచారణకు రావలసిందిగా నోటీసులు ఇచ్చారని అంటున్నారు. ఎర్రముక్కపల్లెకు చెందిన ఓ వైసీపీ నేతకు కూడా నోటీసులు ఇచ్చినట్లు చెబుతారు.

పోలీసుల్లో మల్లగుల్లాలు

శ్రీనివాసరెడ్డి హత్య ఇప్పుడు కొందరు పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందంటారు. జగన్ జమానాలో కడపలో పనిచేసిన కొందరు సీఐలు రక్షకభటులం అన్నది మరిచిపోయి భక్షకభటులుగా మారిపోయారన్న విమర్శ ఉంది. ముఖ్యంగా ఓ సీఐ అయితే ఓ కార్పొరేటరు కొందరు వైసీపీ నేతలతో కలిసి భారీ ఎత్తున రియల్ ఎస్టేట్ చేసినట్లు చెబుతారు. పేదలను బెదిరించి స్థలాలను లాక్కోవడం, వెంచర్లు వేయడం, బాధితులు స్టేషన్‌కు వెళితే వారితో మీకెందుకు, సెటిల్ చేసుకోండంటూ బాధితులనే బెదిరించారనే ప్రచారం ఉంది. ఆ సార్ పనిచేసిన సర్కిళ్లలో ఆయన వైసీపీకి ఊడిగం చేశారనే పేరుంది. శ్రీనివాసరెడ్డి బ్యాచ్ ఆ సార్‌కు కూడా ల్యాండ్ సెటిల్‌మెంటు చేశారనే చర్చ నడుస్తోంది. హత్య జరిగినప్పుడు విచారణ సమయంలో ఆసారు కీలక పత్రాలతో పాటు సుమారు కోటి రూపాయల నగదు ఇతరత్రా సమాచారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెబుతారు. అవన్నీ రికవరీ చూపించలేదంటారు. హత్య వ్యవహారంలో వైసీపీ కీలకనేతల హస్తం ఉండడంతోనే ముఖ్యుల పేర్లు తీసేసి రికవరీ వ్యవహారాన్ని పక్కనబెట్టారన్న ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు సీఐడీబృందం ఆ కేసును టేకప్ చేయడంతో ఆ సారు బ్యాచ్ మల్లగుల్లాలు పడుతున్నట్లు చెబుతున్నారు.

కేసు నిగ్గుతేల్చాల్సిందే

కడప నగరం సర్వమతాలకు నిలయం. ఇక్కడ జనం ప్రశాంతత కోరుకుంటారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎక్కడ లేనివిధంగా అరాచకాలు జరిగాయి. కేవలం భూకబ్జాలు, దందాల కోసం నిరుద్యోగులను, చదువు మానేసిన వారిని గుర్తించి సెటిల్‌మెంట్లకు, దౌర్జన్యాలకు తీసుకుపోవడం, వారికి గంజాయి అలవాటు చేయడం ద్వారా.. వీరంటే జనం భయపడే విధంగా ఈ వైసీపీ బ్యాచ్ తయారు చేసిందని చెబుతారు. ఇప్పుడంతా గంజాయి గ్యాంగ్‌లతో నిండిపోయింది. ఈ కేసులో పక్కాగా విచారించి నిందితులను శిక్షించి భూకబ్జాలకు దందాలకు పాల్పడితే భవిష్యత్తు ఇలా ఉంటుందని మెసేజ్ ఇచ్చినట్లు ఉండాలని నగర ప్రజలు కోరుతున్నారు. గ్యాంగ్‌లను అడ్డుపెట్టుకుని పేదల స్థలాలు కొట్టేసి అమాయకుల మాదిరిగా చిరునవ్వు నవ్వుతూ కటింగ్‌లు ఇచ్చే రాజకీయ నాయకుల నిజస్వరూపం జనాలకు అర్థమవుతుంది.

సార్వత్రిక ఎన్నికల ఖర్చు వివరాలు ఇవ్వండి : డీఆర్వో



మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర గౌడ్

కడప(రూరల్), జూన్ 25: సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసిన అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, పార్లమెంట్ అభ్యర్థులు వారికి సంబంధించిన ఎన్నికల జమా ఖర్చుల వివరాలను డిస్ట్రిక్ట్ ఎక్స్పెండేచర్ మానిటరింగ్ కమిటీకి సబ్మిట్ చేయాలని డీఆర్వో గంగాధర గౌడ్ తెలిపారు. మంగళవారం జడ్పీ సమావేశహాలులో ఎన్నికల్లో పోటీచేసిన అన్ని నియోజకవర్గాల అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు, ఎన్నికల ఏజెంట్లకు, జిల్లా ఎక్స్పెండేచర్ మానిట రింగ్ సిబ్బందికి ఎన్నికల జమా ఖర్చు వివరాల నమోదుపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జూన్ 29 నుంచి జూలై 6 వరకు రాష్ట్ర ఎన్నికల ఎక్స్పెండేచర్ అబ్జర్వర్ జిల్లాకు రానున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తమ జమాఖర్చుల వివరాల బిల్లులు, వోచర్లు, బ్యాంక్ పుస్తకాలు సరైన క్రమంలో జూలై 3వ తేదీలోపు అందజేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులే కాకుండా పోటీచేసిన ప్రతి అభ్యర్థి ఎన్నికల అకౌంట్ ఖర్చులు చాపాలన్నారు. దేనికోసం ఖర్చుచేశారు తేదీతో సహా తెలియజేయాలన్నారు. నామినేషన్ తేదీ నుంచి ఎన్నికల ఫలితాల వరకు అభ్యర్థులు బిల్లులు చెల్లించినవి, ఇంకా చెల్లించనవి కూడా ఖర్చుల వివరాల్లో పొందుపరచాలన్నారు. ఈనెల 27వ తేదీ ఉదయం 10-30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అకౌంట్ రిసెప్షన్ టీమ్ సిబ్బంది కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాలులో అందుబాటులో ఉంటారన్నారు. ఎన్నికల జమాఖర్చులపై కచ్చితంగా వివరాలు తెలపాలని అలాగే ఒరిజినల్ కాపీలు సబ్మిట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్పెండేచర్ నోడల్ అధికారి జి.రంగరాజరావు, డీసీవో సుభాషిణి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ మంజుల వాణి, డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ సురేశ్‌కుమార్, ఎన్నికల ఏజెంట్లు పాల్గొన్నారు.

జగన్‌కు అసాధారణ భద్రత సమంజసం కాదు

- మిగతా ఎమ్మెల్యేలకు కల్పించినట్లే జగన్‌కు కల్పించాలి : తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 25: మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు 986 మంది భద్రతా సిబ్బందితో అసాధారణ రీతిలో ప్రభుత్వం భద్రత కల్పించడం సమంజసం కాదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జగన్‌కు తాడేపల్లె నివాసం వద్ద 934 మందితో, హైదరాబాద్‌లో లోటస్ పాండ్ వద్ద 9 మందితో, ఇడుపులపాయ వద్ద 33మందితో, పులివెందులలో 10 మందితో అసాధారణ రీతిలో భద్రత కల్పించడం సహేతుకం కాదన్నారు. ఇదికాక జగన్ సతీమణి భారతికి నలుగురు, తల్లి విజయమ్మకు ముగ్గురు భద్రతా సిబ్బంది ఉన్నారన్నారు. గత ఐదేళ్లలో జగన్ భద్రతా సిబ్బంది మీద ప్రభుత్వం రూ.296కోట్లు ప్రజాధనాన్ని ఖర్చు చేసిందన్నారు. అందరివీ ప్రాణాలే ప్రతి ఒక్కరికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సరిపోని వారుంటారన్నారు. అలా అని అందరికి అసాధారణ రీతిలో భద్రత కల్పిస్తాయా అని ప్రశ్నించారు. మిగతా ఎమ్మెల్యేలకు కల్పించిన విధంగానే జగన్‌కు కూడా భద్రత కల్పించాలని తులసిరెడ్డి సూచించారు. అంతేకాకుండా 1975లో 50 సంవత్సరాల కిందట నాటి ప్రధాని ఇందిరమ్మ విధించిన ఎమర్జెన్సీ గురించి ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పుడు ప్రస్తావించడం శోచనీయమన్నారు. రాజ్యాంగంలోని 352 ఆర్టికల్ ప్రకారం రాజ్యాంగబద్ధంగా నాడు ఇందిరమ్మ ప్రకటిత ఎమర్జెన్సీ ఉన్నది 21నెలలు మాత్రమే అన్నారు. ఇందిరమ్మనే ఎమర్జెన్సీ ఎత్తివేసి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిపించారన్నారు. ఆ ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ 42సీట్లకు గాను 41సీట్లు గెలిచిందని తులసిరెడ్డి గుర్తుచేశారు. ప్రస్తుతం మోదీ పాలనలో పదేళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలు ఈడీ, ఐటీ, సీబీఐ, ఎన్ఐఏ, ఎలక్షన్ కమిషన్ నిర్వీర్యమయ్యాయన్నారు.

తీగలాగితే... డొంక కదులుతోంది

చిలమకూరు పంచాయతీ అవినీతిపై అధికారుల విచారణ ● కోట్లలో అవినీతి జరిగిందని ఫిర్యాదులు
ఎంపీటీసీ స్టేట్‌మెంట్ తీసుకున్న అధికారులు ● 2021లో ఫిర్యాదు-2022లో నిలదీత
ఐసీఎల్ విరాళాల్లో కూడా అవినీతే : కూటమి ప్రతినిధులు ● ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన అధికారులు


డీఎల్‌పీఓతో కూడిన అధికారులకు ఫిర్యాదు చేస్తున్న కూటమి నేతలు

ఎర్రగుంట్ల, జూన్ 25: చిలంకూరు పంచాయతీ అవినీతిపై తీగలాగితే... డొంక కదులుతోంది. భారీ అవినీతిపై డీపీఓ డి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు నలుగురు అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు. 2021లో ఫిర్యాదు చేయడం, 2022లో మండల సమావేశంలో నిలదీయడం, పెద్ద ఎత్తున దుమారం రేగడం, ఆంధ్రజ్యోతిలో 'ఆ కోటి రూపాయలకు ఎక్కడ పనిచేశారు' శీర్షికన ప్రత్యేక కథనం కూడా ప్రచురితమైంది. గతంలో ఇక్కడి పంచాయతీలో భారీ అక్రమాలు, అవినీతి జరిగిందని జిల్లా అధికారులకు ఎంపీటీసీ నవీన్‌కుమార్ ఫిర్యాదు చేశారు. అధికారపార్టీకి చెందిన వారి హస్తం ఉండడంతో అప్పట్లో సరైన విచారణ జరగలేదు. దీనికి తోడు ప్రజాప్రతినిధులు కూడా అధికారులను రాకుండా చేశారన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఇక్కడ జరిగిన అవినీతి భాగోతాన్ని వెలికితీసేందుకు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టి సారించారు. ఫలితంగా జిల్లా అధికారి విచారణకు ఆదేశించడంతో విచారణ ప్రారంభమైంది. వివరాల్లోకెళితే....

ఎర్రగుంట్ల మండలం చిలమకూరు పంచాయతీలో భారీగా అవినీతి జరిగింది. ఈవిషయమై ఎంపీటీసీ నవీన్‌కుమార్ ఫిర్యాదు చేయడం, బీజేపీ, టీడీపీ నేతలు బాలవెంకటరెడ్డి, నాగేశ్వరరెడ్డి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి దృష్టికి తీసుకెళ్లడంతో డీఎల్‌పీఓలు మస్తాన్‌వల్లి(కడప), భాస్కర్ (జమ్మలమడుగు), ఈఓపీఆర్డీలు షాకీర్‌అలీఖాన్ (రాజుపాలెం), క్రిష్ణ యాదవ్(బి.కోడూరు)తో కూడిన బృందాన్ని డీపీఓ ప్రభా కర్‌రెడ్డి నియమించి ఇక్కడికి విచారణకు పంపారు. పంచాయతీలో వారు మంగళవారం విచారణ చేపట్టారు. అప్పట్లో జరిగిన పనులకు సంబంధించిన ఎం బుక్కులు, రికార్డులు, రసీదులు, వర్క్ ఆర్డర్స్, ఆడిట్ బుక్కులను తనిఖీ చేశారు. పంప్ ఆపరేటర్ రామక్రిష్ణపై భారీ అవినీతి ఆరోపణలు రావడంతో ఆయనతో స్టేట్‌మెంట్ తీసుకున్నారు. నీరు వదిలే వెంకటేష్(స్వీపర్)ను కూడా విచారించారు

● ఫిర్యాదు చేసిన ఎంపీటీసీ నవీన్‌కుమార్‌తో కూడా వారు మాట్లాడారు. 2018 నుంచి 2024 మార్చి 31 వరకు పంచాయతీలో జరిగిన సీసీరోడ్లు, డ్రేనేజీ నిర్మాణాలు, కొత్తగా వేసిన బోర్లు, పైపులైన్లు, నిర్మాణాలు, బ్లీచింగ్ కొనుగోలు, కొత్తమోటార్ల కొనుగోలు, నిరుపయోగమైన సామాన్లు అమ్మితే వచ్చిన డబ్బు ఎంత, ఎలక్ట్రీసిటీ, ఫర్నీచర్ కొనుగోళ్లపై వివరాలు, ఇప్పటి వరకు ఇండియా సిమెంట్స్ చిలమకూరు వారు గ్రామపంచాయతీకి ఇచ్చిన విరాళాలు, ఇతర వస్తువుల పూర్తి వివరాలు ఇవ్వాలని నవీన్ కోరడంతో అతనితో వచ్చిన అధికారులు లిఖితపూర్వక స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఎన్డీయే కూటమి నేతలు బాలవెంకటరెడ్డి, నాగేశ్వరరెడ్డి, సత్యం స్వామి తదితరులు అధికారులకు ఇక్కడ జరిగిన విషయాలపై వివరించారు. అవినీతిపై సత్వరం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. చిలమకూరులో పదేళ్లలో జరిగిన భారీ అవినీతిపై తీగ లాగితే డొంక కదులుతోందని, అన్ని అవినీతి, అక్రమాలు వెలుగు చూస్తాయని ప్రజలు అంటున్నారు.

2022లో విచారణ నివేదిక ఇచ్చాము
డీఎల్‌పీఓ మస్తాన్‌వల్లి

ఇక్కడి ఆరోపణలపై 2022లో కడప డీఎల్‌పీఓగా నేను విచారణ చేసి నివేదిక ఇచ్చాను. అయితే దానిపై ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియడంలేదు. ప్రస్తుతం డీపీఓ ఆదేశాల మేరకు మళ్లీ టీంగా ఇక్కడికి వచ్చాము. ఎంపీటీసీ, కూటమి నేతల ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ చేశాము. ఇండియా సిమెంట్స్ హౌస్‌ట్యాక్స్ కాకుండా, ఇతర వితరణలపై ఆరా తీస్తున్నాము. ఇంజనీరింగ్ పనులపై ఆయా ఇంజనీరింగ్ అధికారులకు తెలిపాము. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్‌తో మాట్లాడాము. ఇటీవల పైప్‌లైన్ వేయలేదన్నారు. పూర్తిస్థాయిలో రిపోర్టు ఇవ్వాలని ఏఈ పీఆర్‌ను ఆదేశించాము. పంప్ ఆపరేటర్‌గా పనిచేయకపోయినా జీతం ఇచ్చిన విషయంపై రిపోర్టు ఇచ్చాము. ఆయనతో పంచాయతీకి సంబంధించిన కాంట్రాక్టు పనులు చేయించారని తెలిసింది. ఎలాంటి రోడ్లు, డ్రైనేజీ, ఇతర కాంట్రాక్టు పనులు ఇవ్వరాదని, చేయించకూడదని నా రిపోర్టులో చెప్పారు. చేసిన పనులపై కూడా విచారిస్తున్నాము. స్వీపర్‌గా పనిచేస్తున్న వెంకటేష్‌ను పంప్ ఆపరేటర్‌గా పనిచేయిస్తూ అతనికి కూడా కాంట్రాక్టు పనులు ఇప్పించారని ఆయన అంగీకరించారన్నారు. దీంతో స్వీపర్ పని చేయకుండా పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు ఆయనతో లిఖితపూర్వక స్టేట్‌మెంట్ తీసుకున్నాము. ఎంపీటీసీ అడిగిన విషయాలన్నింటికీ తాము జవాబు ఇస్తాము. సంబంధిత శాఖాధికారులతో పూర్తి స్థాయిలో రికార్డులు, ఫిజికల్‌గా కూడా చూపించేందుకు ప్రయత్నిస్తాము. ఈ విషయాలన్నింటిపై నివేదికను డీపీఓకు ఇస్తామన్నారు.

'గండికోట'ను సందర్శించిన ట్రైనీ కలెక్టర్లు


ప్రాజెక్టు గురించి ట్రైనీ కలెక్టర్లకు వివరిస్తున్న ఇరిగేషన్ అధికారులు

కొండాపురం, జూన్ 25: ఆరుగురు ట్రైనీ కలెక్టర్లు మంగళవారం గండికోట ప్రాజెక్టును సందర్శించారు. 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కళ్యాణి(కర్నూలుజిల్లా), హేమవంశీ (చిత్తూరుజిల్లా), జగన్నాథ్(గుంటూరుజిల్లా), వినూత్న(అనంతపురంజిల్లా), భావన (కాకినాడజిల్లా), నోక్‌వాల్(ఎన్టీఆర్ జిల్లా) ట్రైనీ కలెక్టర్‌కు ప్రాజెక్టు గురించి ఇరిగేషన్ అధికారులు వివరించారు. గండికోట సొరంగం, ప్రాజెక్టు ఆయకట్టు, సామర్థ్యం తదితర వివరాలను వీరికి క్షుణ్ణంగా వివరించారు. ఇరిగేషన్ ఎస్ఈ అలియాజ్ బాష, ఈఈ రామునాయక్, డీఈలు ఉమామహేశ్వర్లు,చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడి సేవలో...

ఒంటిమిట్ట, జూన్ 25: ఏకశి లా నగిరి కోదండ రాముడిని ట్రైనీ కలెక్టర్లు మంగళవారం సాయంత్రం దర్శించుకున్నా రు. 2023 ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ ట్రైనింగ్ కలెక్టర్లు ఆరుగురు కోదండ రాముడిని దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడప జిల్లా పర్యటన ముగించుకుని తిరుపతికి వెళుతూ మార్గమధ్యలో ఒంటిమిట్టలో కోదండ రామాలయంలో మూలవిరాట్టు సీతారాములను ట్రైనీ కలెక్టర్లు సీహెచ్ కల్యాణి, హేమవంశీ, స్వప్నిల్ జగన్నాథ్, బోలిపల్లి వినూత్న, హెచ్ఎస్ భావన, శుభం నోక్‌వాల్ దర్శించుకున్నారు. తహశీల్దారు రాము, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ వేధిస్తున్నాడంటూ..
తల్లి, బిడ్డ ఆత్మహత్యాయత్నం


కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న తల్లి, కుమార్తె

కడప (క్రైం), జూన్ 25: ఏఆర్ కానిస్టేబుల్ రామకృష్ణ వేధింపులు తాళలేక శంకరాపురం వాసులు తల్లి దండు శారద, పెద్దకుమార్తె లక్ష్మి శైలజ మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు గుర్తించి వారిని వైద్య పరీక్షల నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కడప చిన్నచౌకు పరిధి శంకరాపురంలో నివసిస్తున్న శారద చిన్న కూతురు స్వాతి ఏఆర్ కానిస్టేబుల్‌ను కులాంతర వివాహం చేసుకుంది. కానిస్టేబుల్ అయిన తన అల్లుడు తన పెద్ద కుమార్తె సహా తనను, తన కుమారుడిని మానసికంగా వేధిస్తుండడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వారు చెప్పుకొచ్చారు. అధికారులు తమకు న్యాయం చేసి తమ అల్లుడిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

విద్యుత్ షాక్‌తో పొలంలో రైతు మృతి


పెద్ద సుబ్బరాయుడు మృతదేహం

మైలవరం, జూన్ 25: పొలంలో సాగు చేసిన మినుము పంటకు పురుగుల మందు పిచికారీ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ కాలికి తగిలి పోలు పెద్ద సుబ్బరాయుడు (54) అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలో మంగళవారం చోటుచేసుకున్న సంఘటనపై వివరాల్లోకెళితే రామచంద్రాయపల్లి రైతు పెద్ద సుబ్బరాయుడు తన పొలంలో సాగు చేసిన మినుము పంటకు పురుగుల మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. మెదట ఒక ట్యాంక్ పిచికారీ చేసి మరో ట్యాంక్ పిచికారీ చేసేందుకు వస్తుండగా పొలంలో అక్కడే గట్టుపై ఉన్న మోటారు విద్యుత్ తీగలను గుర్తించక ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ కాలికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి మైలవరం పోలీసులకు, విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని జరిగిన సంఘటనపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. పెద్ద సుబ్బరాయుడుకు భార్య, కుమారుడు, కూమార్తె ఉన్నారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మైలవరం ఎస్ఐ రెడ్డి సురేష్ తెలిపారు.

విద్యుత్ తీగలు పట్టుకుని వ్యక్తి ఆత్మహత్య

గాలివీడు, జూన్25: చీమలచెరువుపల్లి పంచాయతీ కస్పా వాసి యర్రంరెడ్డి (70) విద్యుత్ తీగలు పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే.... యర్రంరెడ్డికి రెండేళ్ల కిందట భార్య మరణించింది. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతూ ఉండేవారని తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యానికి గురవడంతో మానసిక బాధ ఎక్కువై ఆదివారం ఇంటి నుంచి బయటికి వెళ్లాడని తెలిపారు. అప్పటి నుంచి యర్రంరెడ్డి కోసం కుటుంబ సభ్యులు గాలించగా మంగళవారం పల్లెకి సమీపంలోని విద్యుత్ తీగలు చుట్టుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పరిశీలించగా రెండు రోజుల కిందటే మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి యర్రంరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాలుగేళ్ల తరువాత.. కుమారుడి చెంతకు తల్లి


తల్లిని కుమారుడికి అప్పగిస్తున్న సీఐ

ధర్మవరం, జూన్ 25: ఓ తల్లి నాలుగేళ్ల తరువాత కుమారుడి చెంతకు చేరింది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం రైల్వే పోలీసు స్టేషన్‌లో కుమారుడు గురుశేఖర్‌కు ఆర్పీఎఫ్ సీఐ బోయకుమార్ అప్పగించారు. అన్నమయ్య జిల్లా గుంటపాల్యం వాసి రెడ్డెమ్మ నాలుగేళ్ల కిందట రైలులో తప్పిపోయింది. అప్పట్లో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. కాగా సోమవారం తిరుపతి - గుంతకల్లు ప్యాసింజర్ రైలులో రెడ్డెమ్మను గురుశేఖర్ స్నేహితుడు గమనించాడు. వెంటనే గురుశేఖర్‌కు ఫోన్‌చేసి, విషయం తెలిపాడు. గురుశేఖర్ ఆన్‌లైన్‌లో ఫొటో సహా ఆర్పీఎఫ్‌కు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఆర్పీఎఫ్ ఏఎస్ఐ వెంకటరావు సిబ్బందితో తిరుపతి ప్యాసింజర్ రైలు ధర్మవరం రైల్వేస్టేషన్‌కు రాగా అందులో ఉన్న రెడ్డెమ్మను ఫొటో ఆధారంగా గుర్తించారు. ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లి, గురుశేఖర్‌కు సమాచారం అందించారు. మంగళవారం ఉదయం గురుశేఖర్ ధర్మవరం ఆర్పీఎఫ్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. ఆర్పీఎఫ్ సీఐ బోయకుమార్, ఏఎస్ఐ వెంకటరావు రెడ్డెమ్మను కుమారుడు గురుశేఖర్‌కు అప్పగించారు. కుమారుడు ప్రేమ వివాహం చేసుకోవడంతో అలిగి రెడ్డెమ్మ ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు


స్మగ్లర్లు, ఎర్రచందనం దుంగలతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూన్ 25: కడప జిల్లా మల్లేపల్లి అటవీప్రాంతంలో మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి నుంచి 15 ఎర్రచందనం దుంగలు సహా రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం మంగళవారం కడపజిల్లా మల్లేపల్లి అటవీప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. సమీప ఆటోనగర్ చేరుకునేసరికి కొందరు స్మగ్లర్లు రెండు కార్లలో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు. చుట్టుముట్టగా కొందరు పారిపోగా ఆరుగురు స్మగ్లర్లను పట్టుకున్నారు. విచారణలో కడపకు చెందిన యాతగిరి హరి, కొప్పిలి సుధాకర్‌రెడ్డి, తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన ప్రభు, రమేష్, రవి, అయ్యప్పన్ మునియన్‌గా గుర్తించారు. వీరినుంచి రెండు కార్లు, రెండు ద్విచక్రవాహనాలు, 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఐదుగురు స్మగ్లర్ల కోసం గాలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్‌కుమార్ తెలిపారు.

వేంపల్లె షరీఫ్ పుస్తకానికి 'విశాలాక్షి' పురస్కారం



వేంపల్లె, జూన్ 25: టీవీ ప్రకటనల్లో భాష అనే పుస్తకాన్ని రచించిన రచయిత, జర్నలిస్టు డాక్టర్ వేంపల్లె షరీఫ్‌కు విశాలాక్షి పురస్కారం లభించింది. విశాలాక్షి పత్రిక 15వ వార్షికోత్సవం సందర్భంగా ఏడువిభాగాల్లో ఉత్తమ పుస్తకాలను ఎంపిక చేసి ఈ పురస్కారం ప్రకటించారు. అందులో పరిశోధన విభాగంలో షరీఫ్ రాసిన పుస్తకం ఎంపికైంది. ఈనెల 30వ తేదీన నెల్లూరులో జరిగే సభలో నగదు బహుమతి, పురస్కార ప్రధానం ఉంటుంది. ఈ మేరకు మంగళవారం రచయితకు నిర్వాహకులు సమాచారం అందించారు. మనకు తెలియకుండానే మనపై ప్రభావం చూపి మన అలవాట్లు, అభిరుచుల్లో మార్పును తెచ్చే శక్తి ప్రకటనలకు ఉందని రచయిత అన్నారు. మన సంస్కృతి, భాషపై ప్రకటనలు ప్రభావం చూపే తీరును ఉదాహరణలతో సహా ఈ పుస్తకంలో వివరించానని తెలిపారు. ఇప్పటికే ఈ పుస్తకం అనేక యూనివర్సిటీల్లో తెలుగు, జర్నలిజం, ఎంటీఏ విద్యార్థులకు రెఫరెన్సు పుస్తకం కింద ఉందని చెప్పారు. ఇపుడు ఈ అవార్డు ప్రకటించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


వెంకటసుబ్బయ్య (ఫైల్‌ఫొటో)

బద్వేలుటౌన్, జూన్ 25: శేఖర్ థియేటర్ ఎదురుగా ఆటో ద్విచక్రవాహనం ఢీ కొన్న సంఘటనలో కోడూరు చిన్న వెంకటసుబ్బయ్య(45) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సురేంద్రనగర్ వాసి చిన్నవెంకటసుబ్బయ్య బార్బర్‌షాపుతో కుటుంబపోషణ చేస్తుండేవాడు. కాగా సోమవారం నెల్లూరు రోడ్డు జాతీయ రహదారిపై ఆటో ఢీ కొనడంతో ద్విచక్రవాహన దారుడు చిన్న వెంకటసుబ్బయ్య కింద పడి తలకు గాయమైంది. దీంతో స్థానికులు హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య భారతి, కుమార్తె సుప్రియ, కుమారులు చరణ్, జశ్వంత్ ఉన్నారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. దీంతో మృతుని కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

సంబేపల్లె, జూన్25: కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని నారాయణరెడ్డిపల్లె పెట్రోల్ బంకు సమీపంలో మంగళవారం ద్విచక్రవాహనం ఢీకొని అచ్చన్న అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.... నారాయణరెడ్డిపల్లె కస్పాకు చెందిన అచ్చెన్న చిల్లర దుకాణంకు వెళ్లి తన ఇంటికి నడుచుకొని వెళుతుండగా రాయచోటి వైపు నుంచి సంబేపల్లె వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అచ్చెన్న నారాయణరెడ్డిగారిపల్లె సచివాలయంలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్నన్నట్లు తెలిపారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108లో రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బేకరి యజమానికి జరిమానా


బేకరిలో తనిఖీ చేస్తున్న దృశ్యం

బద్వేలు, జూన్ 25: స్థానిక సిద్దవటం రోడ్డులోని రాజు బేకరి యజమానికి మంగళవారం మున్సిపల్ అధికారులు రూ.10వేలు జరిమానా విధించారు. సోమవారం ఓ వ్యక్తి తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా బేకరీలో కేక్ కొనుగోలు చేశాడు. ఇంటికెళ్లి తిని చూడగా అది చేదుగా ఉందని పిల్లలు చెప్పారు. దీంతో లోపల మొత్తం బూజు పట్టిందని తెలిసింది. దీనిపై అతను మున్సిపల్ కమిషనర్ కృష్ణకు ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేరకు శాని టరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మినారాయణ, వార్డు శానిటరీ సెక్రటరీలు బేకరీలో తనిఖీ చేపట్టారు. కమిషనర్ ప్రజలకు పలు సూచనలు ఇస్తూ బేకరీలు, హోటళ్లు, రోడ్లపైన దొరికే ఆహారం విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని, పట్టణంలో డయేరియా కేసులు కూడా పెరుగుతున్నాయని ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నామమాత్రంగా డీఎంహెచ్ఓ విచారణ

పులివెందుల రూరల్, జూన్ 25: అవినీతి వ్యవహారంలో విచారించి చర్యలు తీసుకోవాల్సిన అధికారి లక్షలాది రూపాయలు దండుకుంటున్న ఉద్యోగిని కాపాడేందుకు నామమాత్రంగా విచారణ చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. డీఎంహెచ్ఓ ఉద్యోగిని కాపాడేందుకు ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఫిర్యాదు చేసిన వారిని పూర్తి ఆధారాలు కావాలంటూ వారిని వెనక్కితగ్గేలా ప్రశ్నిస్తూ అవినీతి ఉద్యోగికి అండగా నిలవడంపై వైద్య ఉద్యోగ వర్గాలే విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగి హాజరు పట్టిక, ఎఫ్ఆర్ఎస్ లోకేషన్ వివరాలు, పీహెచ్‌సీలో ఉన్న సీసీకెమెరాల ఫుటేజీ, స్థానిక ప్రజలతో మాట్లాడడం ఇలా పలురకాలుగా విచారణ జరగాల్సి ఉంటుంది. అవేమీ జరగకుండా పీహెచ్‌సీ సిబ్బందితో మాత్రమే సంతకాలుచేయించుకుని విచారణ ముగించారు. వైసీపీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్న ఆ ఉద్యోగి ప్రశ్నించే వారికి వైసీపీ పెద్దల నుంచి ఫోన్లు చేయిస్తూ బెదిరిస్తుంటారని స్థానిక ప్రజలు చెబుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీలో ఎమ్‌పీహెచ్ఎస్ (ఎఫ్) విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి విధులకు గైర్హాజరవుతూ నిర్లక్ష్యం వహిస్తుండడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా వైద్యాధికారి నాగరాజుతో కూడిన బృందం విచారణ చేపట్టారు. అయితే ఫిర్యాదు దారు ఏ అంశాలపై ఫిర్యాదు చేశారో ఆ అంశాలపై పూర్తి ఆధారాలు ఇవ్వాలని డీఎంహెచ్ఓ అన్నారు. ఆమె గైర్హాజరైన వివరాలు, ఆమె ప్రైవేట్‌గా ఎక్కడ విధులు నిర్వహించేదో, గత ప్రభుత్వంలోని వైసీపీ పెద్దలను అడ్డుపెట్టుకుని విధులకు హాజరవకుండా లక్షల రూపాయల జీతం పొందుతుండేదో తదితర వివరాలతో కూడిన పత్రాలను అందించారు. ఇవి సరిపోవు మరిన్ని ఆధారాలు కావాలని చెప్పడంతో ఫిర్యాదు దారుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. విచారణపై ఆంధ్రజ్యోతి డీఎంహెచ్ఓ నాగరాజుతో మాట్లాడగా పీహెచ్‌సీలో విచారణ చేసి ఆర్‌డీకి నివేదిస్తామని తెలిపారు. విచారణ అంటే అందరి సమక్షంలో జరగాలి కదా అని అడగ్గా తాము చూసుకుంటామని సెలవిచ్చారు.

ప్రశాంతంగా పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు
పరిశీలించిన వీసీ చింతా సుధాకర్


ఇంటర్వ్యూలను పరిశీలిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కడప (ఎడ్యుకేషన్), జూన్ 25: ఏపీ ఆర్ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియ రెండో రోజు ప్రశాంతంగా కొనసాగింది. మంగళవారం జరిగిన మేథమేటిక్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. వైవీయూ సహా వివిధ యూనివర్శిటీల సబ్జెక్టు నిపుణులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ రిజిస్ట్రారు ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య ఇంటర్వ్యూలో జరిగే తీరును ఆకస్మికంగా పరిశీలించారు. ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ 26న గణితం, 27న సైకాలజీ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

పుల్లంపేట, జూన్ 25: సీతారాజంపేట సమీప పుల్లంగేరు బ్రిడ్జి వద్ద ఓవర్ టేక్ చేయబోతూ లారీ ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. రైల్వేకోడూరుకు చెందిన కూలీలు మామిడి కాయలు కోసి రాజంపేట వైపు వెళుతుండగా పుల్లంపేట వద్ద వెనుక వైపు నుంచి లారీ ఓవర్‌టేక్ చేయబోయి ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న కూలీలు ఎగిరి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో రైల్వేకోడూరు రెడ్డివారిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన సెనగ జాను, ఆళ్లగడ్డ నియోజకవర్గం మందలూరు వాసి దస్తగిరి గాయపడ్డారు. గాయపడ్డవారిని 108లో రాజంపేట ప్రభుత్వం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పుల్లంపేట ఎస్ఐ రఘురాం తెలిపారు.

పోలీసుల అదుపులో రామచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 25: పోలీసుల అదుపులో హత్యకేసు నిందితుడు రామచంద్రారెడ్డి ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆదివారం రాత్రి యువకుడు మహేశ్వర్‌రెడ్డి హత్య విషయం బహిర్గతమైంది. హత్య చేయడానికి గల కారణాలను తెలుసుకోవడంపై డీఎస్పీ మునిశేఖర్, సీఐలు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న మహేశ్వర్‌రెడ్డిని భూమిరెడ్డి రామచంద్రారెడ్డి గొడ్డలితో నరికి హత్య చేసి శరీర బాగాలను ముక్కలు ముక్కలుగా చేశారు. ఆ ఇంట్లో రక్తపు పరకలు ఉండడంతో గమనించిన తల్లి రత్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ క్రమంలో హత్య విషయం బయటపడిన విషయం తెలిసింది. ఈ క్రమంలో కేసు నమోదు చేసిన పోలీసు యంత్రాంగం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లుగా తెలుస్తోంది.

కడప శాస్త్రినగర్‌లో చోరీ

కడప (క్రైం), జూన్ 25: కడప నగరం అక్కాయపల్లెలోని శాస్త్రినగర్‌లో ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు నగలు అపహరించారు. శాస్త్రినగర్‌కు చెందిన రాజశేఖర్ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం ఊరికి వెళ్లారు. తిరిగి మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చేలోపు ఇంటితాళాలు పగిలి ఉండడంతో తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోనే బీరువా పగలగొట్టి 12 తులాల బంగారు నగలను దొంగలు అపహరించినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి
అతిసారపై అవగాహనలో డీఎంఅండ్ హెచ్ఓ

కడప(కలెక్టరేట్) జూన్ 25: సీజనల్ వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం రామరాజు పల్లిలో సీజనల్ వ్యాధులు, స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌పై ప్రజలకు చేపట్టిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అతిసార ప్రబలకుండా ఉండాలంటే కాచి చల్లార్చిన నీరును తాగాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలనీ, నిత్యం వంటల్లో వాడే కూర గాయలు, పండ్లను కడిగిన తరువాతే వాడాలన్నారు. ముఖ్యంగా చేతులు శుభ్రంగా కడుగు కోవడం వల్ల సీజనల్ వ్యాధులను అదుపు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలంఖాన్ పల్లి అర్బన్ ఆరోగ్య కేంద్రం డాక్టర్లు ఉబేదుల్లా, నిఖిత, ఏఎన్ఎంలు, ఆశాలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

సెల్‌టవర్‌తో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

● పగలు కోతులు, రాత్రి విషపురుగుల బెడద

చెన్నూరు, జూన్ 25 : చెన్నూరు భవానీనగర్‌లోని సెల్‌టవర్‌తో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడమే కాక భయాందోళనకు గురవుతున్నారు. వాటి నిర్వహణపై సరిగ్గా దృష్టి సారించకపోవడంతో అటు కోతులు, ఇటు విష పురుగుల సంచారం ఎక్కువవుతోందని ఆ టవర్ చుట్టూ ఉన్న ఇంటి యజమానులు ఆవేదన చెందుతున్నారు. దాదాపు పదేళ్ల క్రితం సెల్‌టవర్ నిర్మాణం జరిగింది. ఆ తర్వాత దానికి కాపలా ఉన్న వ్యక్తి అప్పుడప్పుడూ వచ్చిపోతుంటాడు. ఇటీవల రోజూ వచ్చి ఆ టవర్ దగ్గర విధుల్లో ఉన్నట్లు సెల్‌ఫోను ద్వారా ఫోటో తీసుకోవడం, ఆ రోజుకు వెళ్లిపోయి మరుసటిరోజు ఉదయం రావడం ఇలా జరుగుతోంది. అయితే ఇటీవల ఈ టవర్‌పై కోతులు ఎక్కువగా చే రాయి. ఆ కోతులు పగలంతా టవరుపైనే ఉంటూ ఇళ్లలో ఎవరూలేని సమయంలో ఇళ్లపైకి వెళ్లి ఆ ఇంట్లోకి చొరబడి వస్తువులు చిందరవందర చేయడం ఇళ్లల్లోనివారిని భయపెట్టడంతో స్థానికులు భయపడుతు న్నారు. కనీసం ఆ టవర్‌పై కోతులు లేకుండా చేసేందుకు సెక్యూరిటీ కూడా ఉండడంలేదని ప్రజలు పేర్కొంటున్నారు. దీనికి తోడు టవర్ చుట్టూ కాంపౌండు వాల్ ఏర్పాటు చేయగా, ఆ మధ్యలో రకరకాల పిచ్చిమొక్కలు, గడ్డి ఏపుగా పెరగడంతో అందులో విషపురుగులు చేరి రాత్రిపూట వీధుల్లోకి, ఇళ్లలోకి వెళుతున్నాయి. దీంతో చుట్టుక్కల ఇళ్ల వారు భయపడుతున్నారు. కనీసం టవర్ మధ్యలో పెరిగిన పచ్చగడ్డి, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయాలన్న ఆలోచన కూడా వారు చేయడంలేదని పలువురు పేర్కొంటున్నారు.




చెన్నూరు భవానీనగర్‌లో సెల్‌టవర్ చుట్టూ పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు...సెల్‌టవర్‌పై ఉన్న కోతులు

విజయదుర్గ సన్నిధిలో రాహుకాల పూజలు




ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి.. రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు

కడప (కల్చరల్), జూన్ 25: విజయదుర్గ సన్నిధిలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో రాహుకాల దీపాలు వెలిగించి నవగ్రహ పూజలు చే సేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. వేకువజామునే పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకు రాహుకాల పూజలు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ అన్ని ఏర్పాట్లు చేశారు.

అభివృద్ధి పనులకు స్థానిక సంస్థలు అడ్డంకి కారాదు

● మాజీ డిప్యూటీ మేయరు ఆరిఫుల్లా



విలేకరులతో మాట్లాడుతున్న ఆరిఫుల్లా

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 25 : అభివృద్ధి పనులకు స్థానిక సంస్థలు అడ్డంకి కారాదని మాజీ డిప్యూటీ మేయరు ఆరిఫుల్లా పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆ యన విలేకరులతో మాట్లాడుతూ కడప నగరంలో అభివృద్ధి పనులు చేయాలంటే తీర్మానాలు అవసరం అవుతాయి. అయితే స్థానిక సంస్థల పాలక వర్గాలు ప్రతిపక్ష పార్టీ ఆధ్వర్యంలో ఉండడం వల్ల అభివృద్ధి పనులకు ఆటంకాలు తలెత్తకూడదని ఆరిఫుల్లా తెలిపారు. స్థానిక సంస్థలు కూడా అభివృద్ధికి సహకరించాలని కోరారు. గతంలో అప్రజాస్వామికంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి కాబట్టి అభివృద్ధికి ఆటంకం ఉండకూడదని ప్రభుత్వం చొరవ తీసుకుని విచక్షణాధికారం ఉపయోగించి స్థానిక సంస్థలపాలకవర్గాలను రద్దుచేసి ఎన్నికలు నిర్వహించడం సమంజసంగా ఉంటుందన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకుడు

కమలాపురం రూరల్, జూన్ 25 :నగరంలోని పడమటివీధిలో వెలసిన శివాలయంలో మంగళవారం టీడీపీ సీనియర్ నాయకుడు చెన్నక్రిష్టారెడ్డి 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి గెలవాలని శివాలయంలో మొక్కుకున్నామని అది నెరవేరినందున మొక్కు తీర్చుకున్నామన్నారు. అనంతరం ఆయన కమలాపురంలోని 30 పడకల ఆసుపత్రిని పరిశీలించారు.

ఇచ్చిన హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 25 : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల హామీ మేరకు పెన్షన్ పెంచుతూ తన హామీ నెరవేర్చుకున్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్ తెలిపారు. మంగళవారం కడప నగరం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 65.3 లక్షల మంది పెన్షనర్లకు సచివాలయ సిబ్బందితో పించన్లు పంపిణీ చేస్తారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వెయ్యి రూపాయలు ఏప్రిల్, మే, జూన్ బకాయిలుగా పరిగణించి జూలై నెలలో రూ.7వేలు అందిస్తున్నట్లు తెలిపారు.

నాణ్యత లేని పనులపై విజిలెన్స్ విచారణ

● కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, జూన్ 25 : నాణ్యత లేని పనులపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపిస్తామని, తప్పు చేశారని తేలితే జైలుకు పంపిస్తామని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ పరిధిలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ మేరీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయనకు చైర్మన్ మేరీ, వైస్ చైర్మన్‌లు మహ్మద్ సాదిక్ శ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్లు పూలబొకేతో స్వాగతం పలికారు. సమావేశ ప్రారంభంలో కౌన్సిల్ ఆమోదం కోసం ఐదు పనులకు సంబంధించిన బిల్లులను ప్రవేశపెట్టారు. అందులో ఒకటి మాత్రమే ఆమోదించారు. మి గిలిన నాలుగు పనులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు నిర్ణయాలు తీసుకోవచ్చని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో కమలాపురం నగర పంచాయతీలో జరిగిన అవినీతిపై ప్రక్షాళన తప్పదన్నారు. అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశం జరుగుతుండగా 12వ వార్డు కౌన్సిలర్ బాబు లేచి నగర పంచాయతీలోని అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో భారీగా అవకతవకలు, అవినీతి చోటు చేసుకుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. జరిగిన పనులపై విజిలెన్స్ అధికారులపై ఫిర్యాదు చేసి సమగ్రంగా విచారణ జరిపి జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కమలాపురం నగర పంచాయితీ పరిధిలో డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల సమస్యలు ఉండకూడదన్నారు. బస్టాండు ఆవరణంలో శివాలయం వద్ద డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతోందని అధికారులు ఎప్పుడైనా వెళ్లి చూశారా అన్నారు. ప్లాస్టిక్ వాడకం నిషేధించాలన్నారు. వేస్ట్ ప్లాస్టిక్ వేసేందుకు ప్రతి ఇంటికీ డబ్బాలు పంపిణీ చేయాలన్నారు. కౌన్సిలర్లు బాబుల్, మహ్మద్‌రఫి, సుగంది, సులీల, సుదర్శనరెడ్డి, పోలయ్య రాజేశ్వరి, రిహానా, టీడీపీ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు ఖాదర్‌బాషా, జంపాల నరసింహారెడ్డి, కంకర సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, యువ నాయకులు రాజారెడ్డి, శంకర్‌యాదవ్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



మట్టి నమూనా సేకరణను పరిశీలిస్తున్న నరసింహారెడ్డి

లింగాల, జూన్ 25: ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకొని పంటలు సాగు చేసుకోవాలని పులివెందుల సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి సూచించారు. మంగలవారం మండల కేంద్రమైన లింగాలలో మండల వ్యవసాయాధికారి రమేష్‌తో కలిసి సేకరిస్తున్న మట్టి నమూనాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూసారపరీక్షలు చేసుకోవడం వలన భూమిలో ఉన్న ఎరువుల లభ్యత గురించి తెలుసుకోవచ్చన్నారు. ఎంత మోతాదులో ఎరువులు వేసుకోవాలి అని తెలుసుకుని సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. మట్టి పరీక్ష ద్వారా భూమికి అనువైన పంటలను తెలుసుకోవచ్చన్నారు. రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదించి మట్టి నమూనాలు తీయించుకోవాలని కోరారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన



ఫిజియోథెరపీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సంతోష్ కుమార్

సింహాద్రిపురం, జూన్ 25: స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం ప్రధానోపాధ్యాయులకు ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంఈఓ శారద తెలిపారు. నిజాం ఫిజియోథెరపీ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ సంతోష్ కుమార్ ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్స్ వాడకుండా ఫిజియోథెరపీ ద్వారా నొప్పి తగ్గించుకునే విధానం, మొబైల్ ఫోన్ల ద్వారా వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ గురించి.. వాటి నివారణకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. వ్యాయామం ద్వారా నొప్పులను ఎలా తగ్గించుకోవచ్చు అనే విషయమై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ అరవింద్, ఫిజియోథెరపిస్ట్ సుధీర్‌కుమార్, భవిత సెంటర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శివకోటిరెడ్డి పుట్టిన రోజు వేడుకలు



శివకోటిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మిత్రబృందం

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 25 : కడప నగరం ఆర్ఎస్ రోడ్డు రామ్‌రాజ్ షోరూంలో 12వ డివిజన్ కార్పొరేటరు సానపురెడ్డి శివకోటిరెడ్డి జన్మదిన వేడుకలు ఆయన మిత్రబృందం ఘనంగా నిర్వహించారు, శివకోటిరెడ్డి కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టింబర్ డిపో గోపీ, వీరకుమార్‌రెడ్డి, లెనిన్ రెడ్డయ్య, రామ్‌రాజ్ సునీల్ కుమార్, సాయిపేట శ్రీను, శంకరాపురం సింధు, రాజశేఖర్, స్టార్ ప్లైవుడ్ నజీర్, వెల్డర్ శ్రీను, బండి కుమార్, ఆంధ్ర స్పైస్ పార్టనర్స్ నాగసుబ్బారెడ్డి, సుదర్శనరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మిత్రబృందం, రామ్‌రాజ్, లెనిన్ క్లబ్, అమరావతి, జాకీ షోరూంల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే మాధవి,కుటుంబ సభ్యులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 25 : విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌ను కడప ఎమ్మెల్యే మాధవీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి కలిశారు. మంగళవారం విజయవాడలోని మంత్రి నివాసంలో నూతనంగా మంత్రి బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రావన్‌రాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సేవకుల సమస్యలు పరిష్కరించాలి

సిద్దవటం, జూన్ 25 : గ్రామ సేవకుల సమస్యలు పరిష్కరిం చాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కా ర్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ గ్రామ సేవకులు, సహాయకుల సంఘం సిద్దవటం మండల కమిటీ సమావేశం సిద్దవటంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మనోహర్ మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో గ్రామసేవకుల పాత్ర కీలకమైందని తెలిపారు. అలాంటి వారికి ఎన్నికల్లో చాలా మందికి డబ్బు ఇవ్వలేదన్నారు. అలాగే నామినీలాగా గుర్తించాలని డిమాండ్ చేశారు. స్థానికంగా గ్రామ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిద్దవటం మండల ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించారు. వీఆర్ఏల జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి, వెంకటసుబ్బయ్య, సుధాకర్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి 'ఎమర్జెన్సీ' చీకటి అధ్యాయం

వేంపల్లె, జూన్ 25: ప్రజాస్వామ్య దేశంలో ఎమర్జెన్సీ అనేది ప్రజాస్వామ్యానికి చీకటి అధ్యాయం అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన జనసంఘ్ నాయకుడు బొమ్మిరెడ్డి లక్ష్మీరెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ సమయంలో ప్రజల ప్రాథమిక స్వేచ్ఛను కబళించి వారి మానవ హక్కులను తుంగలో తొక్కిందన్నారు.

'నేను బడికి పోతా'ను విజయవంతం చేయాలి

● ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 25 : ప్రభుత్వం తలపెట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరం జయనగర్ కాలనీ జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు మండల వనరుల కేంద్రం సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 6 నుంచి 11 సంవత్సరాల్లోపు గల పిల్లలందరూ పాఠశాలల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 13 నుంచి జూలై 12 వరకు 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమగ్ర శిక్ష, కేఎల్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయులు, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలు, గ్రామ ఎడ్యుకేషన్ సెక్రటరీల సహకారంతో సీఆర్పీల ప్రోత్సాహంతో ప్రతి విద్యార్థీ బడి బయట ఉండకుండా బడిలో ఉండేందుకు కృషి చే యాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 పాలెం నారాయణ, ఎం ఈఓ-2 ఇర్షాద్ అహ్మద్, సిద్దవటం ఎంఈఓ విలియంరాజు, అరుణ, ఒంటిమిట్ట ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ప్రభాకర్, సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ కో ఆర్డినేటరు విశ్వనాథరెడ్డి, పీఎంఓ చెన్నకేశవరెడ్డి, ఎన్ఐఎస్ కో ఆర్డినేటరు నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిని రక్షించుకుందాం: యూటీఎఫ్

కడప (ఎడ్యుకేషన్), జూన్ 25 : 'ప్రభుత్వ బడిని రక్షించుకుందాం, పాఠశాలల్లో విద్యార్థులు చేర్పిద్దాం' అని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి పాలెం మహేశ్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ అనురాధ చేతుల మీదుగా ప్రభుత్వ బడిని రక్షించుకుందాం, పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దాం అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహేశ్‌బాబు మాట్లాడుతూ బడి అంటే చుట్టూ ఉన్న సమాజమని, అమ్మ ప్రేమ నాన్న భరోసా కలగలిసిన ఆటపాటల చదువుల బడి ప్రభుత్వ బడి అన్నారు. ప్రభుత్వ బడిలో నైతిక విలువలు, చదువు, సంస్కారం, దేశ భక్తి సమానత్వ భావనలను విద్యార్థులకు నేర్పిస్తారన్నారు. ప్రతి వి ద్యార్థి పాఠశాలల్లో ఉండి చక్కగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. డీఈఓ అనురాధ మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనే కాక ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణలోనూ, సామాజిక సేవలోనూ భాగస్వామి కావడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు నరసింహారావు, సీవీ రమణ, ప్రభాకర్, క్రిష్ణరెడ్డి, గోపినాధ్, చంద్రశేఖర్, కేదార్‌నాథ్, కరీముల్లాతో పాటు పలువురు పాల్గొన్నారు.



విజయదుర్గమ్మను దర్శించుకున్న కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి కుటుంబ సభ్యులు.. ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు

నారా లోకేశ్‌ను కలిసిన అమీర్‌బాబు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 25 : విజయవాడ సచివాలయంలో హెచ్‌ఆర్‌డీ, ఐటీ, ఎలక్ట్రానిక్ ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేశ్‌ను దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

'టెట్' మళ్లీ నిర్వహిస్తామనడం హర్షణీయం

కడప (ఎడ్యుకేషన్), జూన్ 25 : టెట్ పరీక్ష మళ్లీ నిర్వహిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించడం పట్ల ఎస్‌జీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల్లో భాగంగా మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మాట ఇచ్చి మంత్రి మండలిలో ఆమోదం తెలపడం హర్షించదగ్గ విషయమన్నారు. నిరుద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరిని ప్రశంసిస్తూ మళ్లీ టెట్ పరీక్షను మెగా డీఎస్సీకి ముందే నిర్వహిస్తామనడం ఆనందకరమన్నారు. అభ్యర్థుల వయసు విషయంలో కూడా సడలింపు ఇస్తే బాగుంటుందన్నారు.

విద్యార్థులను మోసం చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

● డీఈఓ కార్యాలయం ఎదుట ఆర్ఎస్‌యూ ఆందోళన




కడప ఆర్‌ఐఓ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న నాయకులు... విలేకరులతో మాట్లాడుతున్న కన్నెలూరు శంకర్

కడప (ఎర్రముక్కపల్లె),జూన్ 25: విద్యార్థులను మోసం చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీఈఓ అనురాధకు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాల ప్రారంభం కాకముందే కరపత్రాలు వేసి విస్తృతంగా ప్రచారాలు చేసుకుంటున్నారన్నారు. అక్రమ అడ్మిషన్లకు పాల్పడ్డారన్నారు. ఇటువంటి పాఠశాలలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం చేసే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు హరిబాబు, సాయి, సంతోశ్, సుమంత్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకోవాలి

జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనరు శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తమ పాఠశాలల పేర్లతో టెక్స్ బుక్‌లు, నోట్ బుక్‌లు, మెటీరియల్ ముద్రించి మార్కెట్ ధర కంటే మూడురెట్లు అధికంగా ఎమ్మార్పీ రేట్లు నిర్ణయించి విద్యార్థుల తల్లిదండ్రులపై భారం మో పుతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు ఈ విషయం తెలిసి కూడా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ కార్పొరేట్ స్కూలుకు సంబంధించి ప్రైమరీ క్లాసులకు మున్సిపాలిటీలో 11వేలు, కార్పొరేషన్‌లో 12వేలు సెకండరీ క్లాస్‌కు మున్సిపాలిటీలో 15వేలు, కార్పొరేషన్‌లో 18వేలు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే దీనికి విరుద్ధంగా ప్రైమరీ క్లాసులకు 25 నుంచి 30 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై తక్షణం విచారణ జరిపించి తగు చ ర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీవనరు నాగేంద్రబాబు, నా యకులు వెంకటేశ్, సుధీర్, విష్ణు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి : ఆర్ఎస్ఓ

జిల్లాలో ప్రభుత్వ ని బంధనలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో చాలా వరకు జూనియర్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగుతున్నాయన్నారు. వీటిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని, అలాగే కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఓ నాయకులు లింగమయ్య, ఓబయ్య పాల్గొన్నారు.



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆర్ఎస్‌యూ ప్రతినిధులు

శిథిలావస్థలో పాఠశాలలు

● మైదానాల్లో వర్షపునీరు

జమ్మలమడుగు, జూన్ 25: జమ్మలమడుగు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల ఆవరణాల్లో వర్షపునీరు నిలువ ఉండి విద్యార్థులకు అసౌకర్యంగా మారింది. గత ప్రభుత్వంలో నాడు-నేడు పేరుతో కొన్ని పాఠశాలలకు గోడలు నెర్రెలు చీలినా, పైకప్పులు దెబ్బతిన్నా సంబంధిత పాఠశాలల కాంట్రాక్టర్లు, సిబ్బంది నామమాత్రంగా పనులు చేసి కొన్ని చోట్ల బిల్లులు రాక వదిలేసినట్లు ఆరోపణలున్నాయి. అందులో భాగంగా జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామం ప్రధాన రోడ్డు పక్కన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) శిథిలావస్థకు చేరింది. గత ప్రభుత్వం అధికారులు నిర్లక్ష్యమో, స్థానిక నేతల నిర్లక్ష్యమో ఆ పాఠశాలను పట్టించుకోలేదని ఆరోపణలున్నాయి. ప్రస్తుతం కొద్దిపాటి వర్షం కురిసినా ఉరుస్తున్నాయి. పాఠశాల ఆవరణంలో మోకాళ్లలోతు నీరు ఆగి అసౌకర్యంగా మారింది. ఈనెల 13వ తేదీ పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి ఆవరణలో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. స్థానికులు సమస్యను గమనించి విద్యార్థుల ఇబ్బందులు చూడలేక ప్రహరీ ఒకవైపు రంధ్రం ఏర్పాటు చేసి ఆ నీటిని డ్రైనేజీ కాలువలోకి మళ్లిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు పాఠశాలల ఆవరణాల్లో, మైదానంలో వర్షపునీరు నిలువ ఉంది. అలాగే జమ్మలమడుగు పట్టణంలోని ఎస్సీ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గత ప్రభుత్వం నిర్మించకుండా పట్టించుకోకపోవడంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది నాపరాళ్ల బండలు నాటుకున్నారు. అయితే ప్రహరీకోసం ఏర్పాటు చేసిన పిల్లర్స్ కడ్డీలు అక్కడే వదిలేశారు. పాఠశాల ఆవరణలో కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారాయి. అలాగే పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపాన కన్నెలూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తదితర పాఠశాలలు మూతపడ్డాయి. ఇలాంటి సమస్యలపై ప్రభుత్వం చొరవ చూపి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.




మోరగుడి పాఠశాలలో నిలువ ఉన్న వర్షపునీరు, పాఠశాల ఆవరణంలో నిరుపయోగంగా మారిన భవనాలు

డ్రాపౌట్స్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

చాపాడు, జూన్ 25: మండలంలోని అన్ని గ్రామాల్లో బడి మానేసిన విద్యార్థులపట్ల అందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వారిని పాఠశాలలో చేర్పించాలని ఎంపీడీవో రంతులయ్య, ఎంఈవో రవిశంకర్ కోరారు. చాపాడులోని ఎమ్మార్సీలో సోమవారం నేడు బడికిపోతా కార్యక్రమంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామ సచివాలయ సిబ్బంది డ్రాపౌట్స్‌ను చైతన్యపరచాలన్నారు. మండలంలో 104 మంది బడి మానేసిన విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు. సీడీపీవో సావిత్రి, ఎంఈవో -2 వంశీకృష్ణ మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లు, బాత్‌రూములు, తాగునీరు బాగుండేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, డ్వాక్రా లీడర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యంతర భృతిని తక్షణమే చెల్లించాలి

బద్వేలు, జూన్ 25 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు తక్షణమే మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధన విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం బద్వేలులో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 12వ పీఆర్‌సీ అమలులో సైతం కమిషన్‌ను నియమించి కాలయాపన చేశారే తప్ప విధి విధానాలను రూపొందించి అమలుచేసిన పాపాన పోలేదన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 11వ పీఆర్‌సీలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం దానిని దృష్టిలో ఉంచుకుని మెరుగైన ఫిట్‌మెంట్ ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవానందం, సుధాకర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు శివప్రసాద్, జిల్లా కౌన్సిల్ పవన్‌కుమార్‌తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనాలు ఇవ్వకుంటే న్యాయపోరాటాలు చేస్తాం



ఎంపీడీవో వరప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు

పోరుమామిళ్ల, జూన్ 25 : తమకు గౌరవ వేతనాలు చెల్లించకుంటే న్యాయ పోరాటం చేస్తామని మండలంలోని వలంటీర్లు ఎంపీడీవో వర ప్రసాదరావుకు విన్నవించారు.మండలంలో గత నెలలో అన్ని చోట్ల వలంటీర్లకు వేతనాలు ఇచ్చారని, ఒక్క పోరుమామిళ్ల సచివాలయంలో ఇవ్వలేదని వాపోయారు. గౌరవ వేతనం అందకుంటే న్యాయ పోరాటానికి సిద్ధం అవుతామని వినతిపత్రం అందజేశారు.

ఉర్దూ కళాశాల ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న ఆవాజ్ నాయకులు

బద్వేలు, జూన్ 25: బద్వేలు పట్టణంలోని మహబూబ్‌నగర్‌లో ఉర్దూ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం ఆవాజ్ ఆధ్వర్యం లో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాష మాట్లాడుతూ పట్టణంలో అధిక జనాబా ఉన్నప్పటికీ ఇక్కడ ఉర్దూ కళాశాల ఏర్పాటు చేయకపోవడం బాధా కరమని, ఇక్కడ 10వ తరగతి పాస్ అయిన వారు కడప, ప్రొద్దు టూరు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో నాయకులు మస్తాన్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదు

ఖాజీపేట, జూన్ 25: సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని ఖాజీపేట సీఐ రామాంజులు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజులుగా సోషల్ మీడియాలో ఇరుపార్టీలవారు రాజకీయాల గురించి, వ్యక్తిగతం గురించి ప్రచారాలు చేసుకుంటున్నారన్నారు. అలా చేయడం వలన ప్రజాశాంతికి భంగం కలుగుతుందని, ఏవైనా తప్పులుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు.

విద్యుత్తు అధికారులు స్పందించాలి



ఒరిగిన విద్యుత్తు స్తంభాలు

జమ్మలమడుగు, జూన్ 25: జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో రోటరీ నగర్ వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపుల విద్యుత్తు స్తంభాలు పూర్తిగా ఒరిగాయి. స్థానికులు విద్యుత్తు అధికారులకు సమస్యను తెలిపినా రాలేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గాలులు, వర్షం కురిసినప్పుడు స్తంభాలు పడిపోయే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.

'అన్ని డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇస్తాం'



మాట్లాడుతున్న ఏపీఎం వెంకటరమణ

చాపాడు, జూన్ 25: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇస్తామని వెలుగు ఏపీఎం వెంకటరమణ తెలిపారు. చాపాడులోని వెలుగు కార్యాలయంలో మంగళవారం రుణాలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జూలై నెల నుంచి మహిళలకు రుణాలు ఇచ్చేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. శ్రీనిధి, బ్యాంకుల ద్వారా రుణాలను డ్వాక్రా మహిళలకు ఇస్తున్నామన్నారు. తీసుకున్న రుణాలను తిరిగి సక్రమంగా చెల్లిస్తే మళ్లీ ఇతరులకు ఆ రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. మహిళలు తీసుకున్న డబ్బులతో గొర్రెలు, పొట్టేళ్ల, గేదెల పెంపకం వారికి ఇష్టమైన ఇతర వృత్తులకు ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో సీసీలు సుబ్బరత్న, రాజా, హరి, తులసి, డ్వాక్రా సంఘాల మహిళా అధ్యక్షురాలు మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇరుకైన మెయిన్‌బజార్‌పై కమిషనర్ చర్యలు



పరిశీలిస్తున్న రామక్రిష్ణయ్య

ఎర్రగుంట్ల, జూన్ 25: 'ఆక్రమణలతో ఇరుకైన మెయిన్ బజార్' ఆంధ్ర జ్యోతిలో వచ్చిన వార్తపై కమిషనర్ రామ క్రిష్ణయ్య, నగర పంచాయతీ అధికారులు స్పందించారు. రైల్వేస్టేషన్ క్రాస్‌రోడ్డు వద్ద కొయ్యలు తీయించారు. బస్‌షెల్టర్ గురించి టీడీపీ సీనియర్‌నాయకుడు కొండారెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దాన్ని బాగుచేయి స్తామని హామీ ఇచ్చారు. అలాగే ఆక్రమణలపై కూడా కమిషనర్ స్పందించారు. వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రయాణికులకు ఇబ్బందిలేకుండా, కూర్చోనేందుకు రైల్వేస్టేషన్ క్రాస్ రోడ్డు వద్ద 1988-89 జడ్పీహైస్కూల్ టెన్త్ బ్యాచ్‌వారు మూడు బెంచీలు వేస్తామని చెప్పడంతో వెంటనే ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. గ్రావెల్ వేయిస్తామని కమిషనర్ తెలిపారు. అలాగే వినాయకనగర్‌లో ఉన్న బోర్లను ఉపయోగించుకునేందుకు, ఆర్వో బ్రిడ్జి పక్కనున్న ట్యాంక్‌ను శుభ్రం చేయించాలని, ట్యాంక్‌ఎక్కేందుకు నిచ్చెనను తయారు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ వార్డు మెంబర్ భాస్కర్, టీడీపీ సీనియర్ నాయకుడు కొండారెడ్డి కమిషనర్‌ను కోరారు.

మార్కెట్‌లో అంతర్గత రోడ్లపై వ్యాపారం

లీజు రద్దు చేస్తామని ఆగ్రహించిన కమిషనర్



కూరగాయల మార్కెట్‌లో అంతర్గత రోడ్లు ఆక్రమించడంపై ఆగ్రహిస్తున్న కమిషనర్

ప్రొద్దుటూరు, జూన్ 25: మున్సిపల్ తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో అంతర్గత రోడ్లపై కూరగాయలు పోసి వ్యాపారాలు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ రఘునాథరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ రెవిన్యూ శానిటరీ అధికారులతో కలిసి ఆయన కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో కూరగాయల వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ వేయడం వలన అపరిశుభ్రంగా పెట్టుకోవడంపై ఆగ్రహించారు. మార్కెట్‌లో పార్కింగ్ వసతి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా మార్కెట్ లోపల సెక్యూరిటీ గార్డు పెట్టి నియంత్రిస్తామన్నారు. మార్కెట్‌లో రోజువారి పన్నుల వసూలు, సైకిల్ స్టాండ్ ఫీజు వసూలు పై ఆరా తీశారు. వ్యాపారులను పిలిచి తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.లేదంటే భారీగా జరిమానా విధిస్తామన్నారు. మార్కెట్‌లో అసోసియేషన్ వుండి కూడా ఎందుకు సమస్యలు పరిష్కరించుకోవడంలేదన్నారు. ఈ పర్యవేక్షణలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మునిరత్నం ,మున్సిపల్ ఆర్ఐ చరణ్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

● బావి నుంచి గ్రామస్థులు నీళ్లు తెచ్చుకుంటున్న వైనం ● అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికుల ఆవేదన

జమ్మలమడుగు, జూన్ 25: జమ్మలమడుగు మండలంలోని శేషారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ గ్రామంలో మూడు రోజుల నుంచి తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో గ్రామంలోని చుట్టూ పొలాల్లో, బావుల్లో, కోనేర్లలో వర్షపునీటితో నిండాయి. గ్రామం చుట్టూ నీరు ఉన్నా తాగడానికి నీరు లేవని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు తాగడానికి నీరు లేక బావుల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో త్రీఫేజ్ కరెంటు లేకపోవడంతో నీటి సమస్య ఏర్పడిందని గ్రామ సర్పంచ్ గురుశేఖర్ తెలిపారు. మంచినీటి సమస్య ఉందని, మూడు రోజులుగా విద్యుత్తు అధికారులకు తెలియజేసినట్లు సర్పంచ్ తెలిపారు. అయినా అధికారులు రాకపోవడంతో త్రీఫేజ్ కరెంటు లేకపోవడం వలన నీటి సమస్యతో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. విద్యుత్తు అధికారులు మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శేషారెడ్డిపల్లెలో బావి వద్ద నుంచి నీళ్ల బిందెలను తీసుకెళు తున్న దృశ్యం, నీళ్లు తోడుతున్న స్థానికులు

కన్నుల పండువగా కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం



బద్వేలు, జూన్ 25: పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు.ఈ కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా నిర్వహించిన కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కడప జిల్లాగా పేరును పునరుద్ధరించాలి



ఎమ్మెల్యేకి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు ,జూన్ 25 : జిల్లా పేరులో కడప అనే పదాన్ని తొలగించి వైఎస్ఆర్ జిల్లా గా మార్చి గత వైసీపీ ప్రభుత్వం చారిత్రక ద్రోహం చేసిందని టీడీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ కడప జిల్లాగా తిరిగి పునరుద్ధరించే చర్యలు తీసుకోవాలని ఏపీ విభజన హామీల ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు పాతకోట శ్రీనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని కామనూరులోని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్వగృహంలో ఆయనను కలిసి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సమితి సభ్యులు డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, డాక్టర్ బ్రహ్మేశ్వరకుమార్, డాక్టర్ శంకర్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జింకా సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పొంచి ఉన్న దారి సమస్య

జమ్మలమడుగు, జూన్ 25: జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలోని మిఠాయిగిరివీధి ఉర్దూ హైస్కూలు వద్ద నుంచి పెన్నానది మీదుగా మైలవరం మండలం వేపరాల వెళ్లే దారి కల్వర్టు దెబ్బతింది. అయిదు సంవత్సరాల నుంచి గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని స్థానికులు వాపోతున్నారు. మూడు సంవత్సరాల క్రితం అధిక వర్షాల వలన పెన్నానదికి వరదనీరు ప్రవహించి రోడ్డు పెన్నానదిలో కోతకు గురైంది. తర్వాత గత ప్రభుత్వం స్పందించలేదని, పది నెలల క్రితం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మట్టి తరలించి రోడ్డు సమస్యను పరిష్కరించారు. అయితే ఈ ఏడాది ఇటీవల కురిసిన వర్షాల వలన వేపరాల సమీపాన పెన్నానదిలో సిమెంటు రోడ్డు కోతకు గురైంది. దాని పక్కనే చిన్న కల్వర్టు వంతెన ఒరిగి నెర్రెలు చీలింది. అదమరిస్తే ట్రాక్టర్లు బోల్తాపడే అవకాశం ఉంది. అధికారులు పరిశీలించి రోడ్డు సమస్యలు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



దెబ్బతిన్న కల్వర్టు రోడ్డు

నెర్రెలు చీలిన కల్వర్టు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



బద్వేలు.. సమావేశంలో మాట్లాడుతున్న ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లేశ్

బద్వేలు రూరల్, జూన్ 25 : సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.మల్లేశ్ అన్నారు. మంగళవారం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్, శ్రీకృష్ణదేవ రాయనగర్ వార్డు సచివాలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, 0-5 సంవత్సరాల్లోపు చిన్నారుల్లో ఈ సీజన్‌లో డయేరియా వచ్చే ఆస్కారం ఉందన్నారు. మున్సిపాలిటీ,గ్రామీణ ప్రాంతాల్లో పైపు లీకేజీ, నీటి నిల్వ గుంటలు లేకుండా చూసుకోవాలన్నారు. జూలై 1 నుంచి 31వరకు ఆగష్టు 20 నుంచి 24వరకు జరగబోయే డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా ప్రతి ఆరోగ్య ఆశా కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు దయారియా, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జె.వినయ్‌కుమార్, సౌమ్య, శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటరు వెంగయ్య, సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ, హెల్త్ సూపర్‌వైజరు శివరామిరెడ్డి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాశినాయన..: సీజన్‌లో సంక్రమించి డయేరియా,వైరల్ ఫీవర్స్ లాంటి వాటిపై క్షేత్రస్థాయి ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలని మండల వైద్యాధికారి ప్రశాంతి పేర్కొన్నారు.మంగళవారం నర్సాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయేరియా లాంటి సీజనల్ వ్యాధులపై అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ సెక్రటరీలకు, ఏఎన్ఎంలు,ఆశాకార్యకర్తలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగాఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నీటిగుంతలు ఉన్నట్లైతే బ్లీచింగ్ చల్లించాలని కోరారు. ఈకార్యక్రమంలో పలువురు పంచాయతీ సెక్రటరీలు,ఆశా అంగన్వాడీ కార్యకర్తలు వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం..: మలేరియా రాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి హిమబిందు అన్నారు. మంగళవారం వైఎంఆర్ కాలనీ పట్టణ ఆరోగ్యకేంద్రంలో పోలియో వ్యతిరేక మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే ప్రతి ఆశా పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ సాధు శ్రీనివాసులు, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎం.వి.సుబ్బారెడ్డి, హెల్త్‌సెక్రెటరీలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.